ఆదేశిక సూత్రాలు - కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలు

ఆదేశిక సూత్రాలను కె.సి.వేర్..లక్ష్యాలు, ఆశయాల మ్యానిఫెస్టోగా వర్ణించారు. భారత ప్రజల సంక్షేమానికి, శ్రేయస్సు కోసం ఉద్దేశించిన ఆదేశిక సూత్రాలు మన రాజ్యాంగంలోని శ్రేయోరాజ్య భావనను తెలుపుతున్నాయి. రాజ్యాంగ పరిషత్ సలహాదారు బి.ఎన్. రావు సమర్పించిన రాజ్యాంగ చిత్తుప్రతిలో.. ఆదేశిక సూత్రాలను న్యాయ సంరక్షణ లేని హక్కులుగా పేర్కొన్నారు. ఐర్లాండ్ రాజ్యాంగం నుంచి గ్రహించిన ఈ భావనను మన దేశ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించారు. ఆధునిక కాలంలో ప్రపంచవ్యాప్తంగా అంగీకరించిన సంక్షేమ రాజ్యభావనకు ప్రతీక ఆదేశిక సూత్రాలు. రాజ్యాంగంలోని 4వ భాగంలో 36 నుంచి 51 వరకు గల అధికరణలలో రాజ్య విధాన ఆదేశిక సూత్రాలు ఉన్నాయి. ఇవి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాలుగా పని చేస్తున్నాయి. ఆదేశిక సూత్రాలను ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించటానికి ఉద్దేశించిన ఇన్‌స్ట్రుమెంట్ ఆఫ్ ఇన్‌స్ట్రక్షన్స్‌గా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పేర్కొన్నారు. ఈ సూత్రాలు శాసన, కార్యనిర్వాహక శాఖలకు కరదీపికలుగా పనిచేస్తాయని ఎం.సి. శీతల్‌వాడ్ అభిప్రాయపడ్డారు. రాజ్య విధాన ఆదేశిక సూత్రాలను అవగాహన చేసుకోవడానికి, సరైన విశ్లేషణ చేయడానికి ప్రొఫెసర్ ఎం.పి. శర్మ వీటిని మూడు రకాలుగా వర్గీకరించారు.

I) సామ్యవాద, శ్రేయోవాద నియమాలు

- భారతదేశ సంపదను దేశ ప్రజలందరి సమష్టి ప్రయోజనం కోసం వినియోగించటం, సంపద కొద్దిమంది వ్యక్తుల చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా చూడటం.
- సమాన పనికి సమాన వేతనం కల్పించటం. ప్రభుత్వాలు తమ ఆర్థిక స్థోమతను అనుసరించి ప్రజలందరికి జీవనోపాధిని అంటే పనిహక్కును కల్పించటం.
- వ్యక్తి, సహకార ప్రాతిపదికపై చిన్నతరహా కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేయటం.
- 42వ అధికరణను అనుసరించి అనువైన శ్రామిక వాతావరణాన్ని ఏర్పరచి మాతాశిశు సంక్షేమం కోసం కృషిచేస్తూ ప్రసూతి వసతులను కల్పించటం
- 43వ అధికరణ ప్రకారం కనీస వేతనాలు, న్యాయమైన పనిగంటలు ఏర్పాటు చేయటం.

II) గాంధేయ నియమాలు

- గాంధీ తన జీవితకాలంలో ప్రబోధించిన సూత్రాలు, సిద్ధాంతాలను గాంధేయ నియమాలుగా పేర్కొంటారు.
- 40వ అధికరణ ప్రకారం స్థానిక స్వపరిపాలనను పటిష్ట పరచటానికి అవసరమైన పంచాయితీరాజ్ వ్యవస్థను పటిష్టపరచాలి. గ్రామ రాజ్యం ద్వారానే రామరాజ్య స్థాపన జరగాలనేది గాంధీ భావన.
- 46వ అధికరణ ప్రకారం సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు రిజర్వేషన్లు కల్పించాలి.
- 47వ అధికరణ ప్రధాన ఉద్దేశం ప్రజల ఆయురారోగ్యాలకు భంగం కలిగించే మత్తు పదార్థాలను, మద్యపానాన్ని నిషేధించటం.
- పశుపోషణ, వ్యవసాయాభివృద్ధి విషయంలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించి, గోవధను నిషేధించాలని 48వ అధికరణ పేర్కొంటుంది.
- 49వ అధికరణను అనుసరించి ప్రాచీన భారతీయ సంస్కృతికి చిహ్నమైన పురాతన శిల్ప సంపదను, కట్టడాలను సంరక్షించటం.

III) ఉదార మేధాపరమైన విషయాలు

- 44వ అధికరణ ప్రకారం భారతీయులందరికీ వర్తించే కామన్ సివిల్‌కోడ్ ఏర్పాటు చేయటం.
- 45వ అధికరణ ప్రకారం 6 నుంచి 14 సంవత్సరాల లోపు బాలబాలికలందరికీ ప్రాథమిక విద్యను ఉచితంగా అందించటం.
- 50 అధికరణను అనుసరించి న్యాయశాఖకు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించడం కోసం కార్యనిర్వాహక శాఖ పరిధి నుంచి న్యాయ శాఖను వేరుచేయటం
- 51వ అధికరణ ప్రకారం అంతర్జాతీయ చట్టాలు, న్యాయాన్ని, సాంప్రదాయాలను గౌరవించటంతో పాటు ప్రపంచశాంతికి కృషి చేయటం.

42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన అంశాలు

- 1976లో ఇందిరాగాంధీ ప్రభుత్వ కాలంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆదేశిక సూత్రాలలో 4 నూతన అంశాలను చేర్చారు. అవి..
  1. అందరికీ న్యాయాన్ని అందించడంలో భాగంగా ఉచిత న్యాయ సహాయాన్ని అందించటం.
  2. పర్యావరణం, అడవులు, వన్యమృగాలు, ప్రాణులను సంరక్షించటం.
  3. పరిశ్రమల నిర్వహణా యాజమాన్యంలో కార్మికులకు భాగస్వామ్యం కల్పించటం.
  4. బాలలు దోపిడికీ గురికాకుండా వారికి తగిన అవకాశాలు, పరిస్థితులను కల్పించి వారి అభ్యున్నతికి తోడ్పడటం.

44వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన అంశం

- 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా.. వ్యక్తుల మధ్య, సమూహాల మధ్య ఆదాయంలోనూ, అంతస్తులలోనూ, అవకాశాలలోనూ అసమానతలు తగ్గించడానికి కృషి చేయటం.

86వ సవరణ ద్వారా చేర్చిన అంశం

- 2002లో ఎన్‌డీఏ ప్రభుత్వ కాలంలో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా పసిపిల్లలకు 6 ఏళ్ల వయసు వచ్చేవరకు సంరక్షణతో పాటు పూర్వ ప్రాథమిక విద్యను అందించటం అనే అంశాన్ని చేర్చారు.

ఆదేశిక సూత్రాలు – IVవ భాగంలో లేనివి...

1. 350(ఎ) అధికరణ ప్రకారం మాతృభాషలో విద్యాబోధన చేయాలని కేంద్రం రాష్ట్రాలను ఆదేశించవచ్చు.
2. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడానికి, సాంస్కృతిక సమైక్యత కోసం హిందీని జాతీయ భాషగా అమలుపరచటం.
3. 335 అధికరణ ప్రకారం ఉద్యోగాలలో కొన్ని వర్గాలకు సరైన ప్రాతినిధ్యం లభించలేదని భావించినపుడు పాలనా సామర్థ్యానికి భంగం కలగకుండా ప్రత్యేక అవకాశాలను కల్పించటం.

ఆదేశిక సూత్రాల అమలు – పరిశీలన

- ఆదేశిక సూత్రాల అమలు కోసం న్యాయస్థానాలను సంప్రదించటానికి అవకాశం లేదు.
- ఆదేశిక సూత్రాల అమలు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శాసనాలు చేయాలి.
- భారత రాజ్యాంగంలో చేసిన మొదటి సవరణ భూసంస్కరణల కోసం ఉద్దేశించింది.
- 73,74 రాజ్యాంగ సవరణల ద్వారా.. రాజ్యాంగంలో పేర్కొన్న స్థానిక సంస్థలకు, పంచాయితీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగబద్ధత కల్పించారు.
- కేంద్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో 'NREGP' జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా ఏడాదికి కనీసం 100 రోజుల పనిదినాలతో ఉపాధి కల్పిస్తోంది.
- రాజ్యాంగంలో 45వ అధికరణ ద్వారా పేర్కొన్న విధంగా 6 నుంచి 14 ఏళ్లల లోపు బాలబాలికలకు నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా చేర్చారు.
- రాజ్యాంగం ద్వారా ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన రిజర్వేషన్లతో పాటు బీసీలకు కూడా విద్యా ఉద్యోగాలలో ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించారు.
- 1980లో రూపొందించిన పర్యావరణ పరిరక్షణ చట్టం. 1972లో జాతీయ అటవీ విధానం, వన్యమృగ ప్రాణి సంరక్షణ చట్టం ముఖ్యమైనవి.
- 1976లో కనీస వేతనాల చట్టాన్ని రూపొందించారు.
- 1973లో న్యాయవ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తిని కల్పించడం కోసం కార్యనిర్వాహక పరిధి నుంచి వేరుచేసి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌ను సవరించారు.
- దేశంలో నేటికీ కామన్ సివిల్‌కోడ్‌ను ఏర్పాటు చేయలేకపోయారు. గోవాలో మాత్రమే కామన్ సివిల్‌కోడ్ అమల్లో ఉంది.
- రాజ్యాంగ పరమైన సంరక్షణ లేదు.
- సర్ ఐవర్ జెన్నింగ్స్ ప్రకారం ఆదేశిక సూత్రాలు 'కేవలం అలంకార పూరితమైనవి పట్టించుకోదగినవి కావు'
- ఆదేశిక సూత్రాలు 'బ్యాంకులు తమ దగ్గర ఉండే సౌకర్యాన్ని అనుసరించి డబ్బును చెల్లించే చెక్కుల వంటివి'గా కె.టి. షా పేర్కొన్నారు
- నూతన సంవత్సరం ముందురోజు చాలా గొప్పగా తీర్మానించుకొని మరుసటి రోజు మర్చిపోయే ప్రమాణాల వంటివని ప్రొఫెసర్ నసీరుద్దీన్ షా విమర్శించారు.

ప్రాక్టీస్ ప్రశ్నలు

1. ఆదేశిక సూత్రాలలో పేర్కొన్న కామన్ సివిల్ కోడ్ ప్రధాన ఉద్దేశం?

ఎ) జాతీయ సంరక్షణ బి) ఆర్థిక సమానత్వం
సి) జాతీయ సమైక్యత డి) అల్పసంఖ్యాక వర్గాల సంరక్షణ

2. ఆదేశిక సూత్రాలను భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ముఖ్యోద్దేశం?

ఎ) రాజకీయ ప్రజాస్వామ్యం బి) సాంఘిక ప్రజాస్వామ్యం
సి) గాంధేయవాదం
డి) ఆర్థిక, సామాజిక ప్రజాస్వామ్యం

3. భారతదేశ విదేశాంగ విధాన స్వభావాన్ని తెలిపే అధికరణ?

ఎ) 36 బి) 50
సి) 51 డి) 51(ఎ)

4. భారత రాజ్యాంగంలో శ్రేయోరాజ్య భావనను విశదీకరించే అంశం ఏది?

ఎ) రాజ్యాంగ ప్రవేశిక బి) ఆదేశిక సూత్రాలు
సి) ప్రాథమికహక్కులు డి) సంక్షేమ పథకాలు

5. బాలకార్మిక వ్యవస్థను నిషేధిస్తూ ప్రభుత్వం ఏ సంవత్సరంలో చట్టం చేసింది?

ఎ) 1978 బి) 1979 సి) 1976 డి) 1980

6. బలహీన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడానికి ఉద్దేశించిన అధికరణ?

ఎ) 43 బి) 44 సి) 45 డి) 46

7. ఆదేశిక సూత్రాలు?

ఎ) న్యాయ సంరక్షణ లేనివి
బి) న్యాయ సంరక్షణ ఉన్నవి
సి) సుప్రీంకోర్టు మాత్రమే అమలుపరచగలిగేవి
డి) సుప్రీంకోర్టు, హైకోర్టులు అమలుపరచగలిగేవి

జవాబులు	1	2	3	4	5	6	7
	C	D	C	B	A	D	A

ఆదేశిక సూత్రాలు

ఆర్టికల్ 46:

షెడ్యూల్డ్ కులాలు, తెగలు, బలహీన వర్గాల విద్య, ఆర్థిక ప్రయోజనాలను పెంపొందించడానికి రాజ్యం కృషి చేయాలి. సామాజిక అన్యాయాలు, అన్ని రకాల పీడనల నుంచి వారిని రక్షించాలి.

ప్రాథమిక హక్కుల్లోని నిబంధనలకు మరింత బలం చేకూర్చేలా, అణగారిన వర్గాల ప్రయోజనాల నిమిత్తం ఈ ఆర్టికల్‌ను రాజ్యాంగ నిర్మాతలు రాజ్యాంగంలో చేర్చారు. 'బలహీన వర్గాలు' అనే పదం పరిధిలోకి ఎవరు వస్తారో తెలిపే విధివిధానాలను రూపొందించాలని శాంతి స్టార్ బిల్డర్స్ వర్సెస్ నారాయణ్ కిమ్‌లాల్ తోతియే (1990) కేసులో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని నిర్దేశించింది.

ఆర్టికల్ 47:

ప్రజల్లో పోషకాహారం స్థాయి, జీవన ప్రమాణాలు, ప్రజారోగ్యం పెంచడాన్ని తన ప్రథమ కర్తవ్యంగా రాజ్యం భావించాలి. అదే విధంగా వైద్య అవసరాలకు తప్ప, మిగిలిన సందర్భాల్లో మత్తు పానీయాలు, మత్తు పదార్థాలు వాడటాన్ని నిషేధించాలి.

ఆర్టికల్ 48:

వ్యవసాయం, పశుపోషణలు ఆధునిక, సాంకేతిక విధానాల్లో జరగడానికి కృషి చేయాలి. ఆవులు, దూడలు, ఇతర పాలిచ్చే పశువుల వధను నిషేధించాలి.

ఆర్టికల్ 48ఎ:

పర్యావరణ పరిరక్షణ, అడవుల వృద్ధికి, వన్య ప్రాణుల సంరక్షణకు ప్రభుత్వం కృషి చేయాలి. (దీన్ని 42వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976 ద్వారా రాజ్యాంగంలో చేర్చారు)

పర్యావరణ పరిరక్షణలో అత్యంత ప్రాముఖ్య మున్న ఆర్టికల్ ఇది. ఈ ఆర్టికల్‌కు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ చట్టం, 1986ను చేసి లక్ష రూపాయల జరిమానా, ఏడేళ్ల వరకూ జైలుశిక్ష విధించాలని నిబంధనలు చేసింది. పర్యావరణ పరిరక్షణలో ప్రముఖ పాత్ర పోషిస్తూ కేవలం ఒక ఉత్తరాన్ని సైతం పబ్లిక్ ఇంటరెస్ట్ లిటిగేషన్‌గా భావించి అనేక తీర్పులను సుప్రీంకోర్టు వెలువరించింది. ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఎన్విరో లీగల్ ఆక్షన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1996) కేసులో 'ఎన్విరాన్‌మెంట్ కోర్టు'లను ఏర్పాటు చేయాలని సూచించింది.

ఆర్టికల్ 49:

కళాత్మకమైన లేదా చారిత్రాత్మకమై జాతీయ ప్రాముఖ్యం కలిగి, పార్లమెంట్ చట్టం ద్వారా గుర్తించిన ప్రదేశాలు లేదా వస్తువులు కాపాడటం, ఎగుమతి కాకుండా చూసే బాధ్యత రాజ్యానిదే.

ఆర్టికల్ 50:

ప్రభుత్వ సర్వీసుల్లో న్యాయశాఖను కార్యనిర్వాహక శాఖల నుంచి వేరు చేయడానికి రాజ్యం చర్యలు తీసుకోవాలి.

ఆర్టికల్ 51:

రాజ్యం కింది అంశాల సాధనకు కృషి చేయాలి.

ఎ) అంతర్జాతీయ శాంతి, భద్రతలను పెంపొందించడం

బి) వివిధ రాజ్యాల మధ్య తగిన, గౌరవ ప్రదమైన సంబంధాలు కొనసాగించడం

సి) అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాల పట్ల గౌరవాన్ని పెంపొందించడం

డి) అంతర్జాతీయ వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవడాన్ని ప్రోత్సహించడం.

భారతదేశం అలీనోద్యమానికి సారథ్యం వహించడం, వివిధ అంతర్జాతీయ శాంతి పరిరక్షక దళాలకు తోడ్పడటం మొదలైన చర్యలు ఈ ఆర్టికల్ అమల్లో భాగమే. మన దేశంలో ప్రత్యేక చట్టం చేయనంతవరకు అంతర్జాతీయ చట్టాల అమలు సాధ్యం కాదు. అంతర్జాతీయ చట్టాలను, ఒప్పందాలను అమలు చేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికే ఉంది. ఒకవేళ అంతర్జాతీయ చట్టానికి మనదేశ చట్టాలు వ్యతిరేకంగా ఉన్నప్పటికీ మన చట్టాలు మాత్రమే అమలవుతాయని సుప్రీంకోర్టు వివిధ కేసుల్లో పేర్కొంది.

నమూనా ప్రశ్నలు

1. భారత రాజ్యాంగంలో ఏ ప్రకరణ ద్వారా గ్రామ పంచాయితీలను ఏర్పాటు చేయడానికి రాష్ట్రాలు చర్యలు చేపడతాయి?

(గ్రూప్-1, 2008)

ఎ) 39 బి) 41 సి) 40 డి) 42

సమాధానం: సి

2. దేశంలో సామ్యవాద తరహా సమాజాన్ని ఏర్పాటు చేయడానికి రాజ్యాంగంలో నిర్దేశించిన అంశం/భాగం? (గ్రూప్-1, 2007)

ఎ) అంశం/భాగం III బి) అంశం/భాగం XIV

సి) అంశం/భాగం IV డి) ఆరో షెడ్యూల్

సమాధానం: సి

3. రాజ్యాంగంలోని ఏ భాగంలో ఆదేశిక సూత్రా లు ఉన్నాయి?

(గ్రూప్-1, 1994)

ఎ) 1 బి) 2 సి) 3 డి) 4

సమాధానం: డి

4. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలకు మధ్య విరోధానికి

కారణం? (గ్రూప్-1, 1994)

ఎ) లిఖిత రాజ్యాంగం

బి) రాజకీయ శూన్యం నింపాలనే న్యాయశాఖ ఆశ

సి) సాంఘిక, ఆర్థిక అసమానత

డి) ముందు చూపున్న నాయకులు లేకపోవడం

సమాధానం: సి

5. ఆదేశిక సూత్రాలకు సంబంధించి ఆర్టికల్ 41లో లేని హక్కు? (గ్రూప్-1, 1994)

ఎ) పని బి) ఆశ్రయ

సి) విద్య డి) ప్రభుత్వ సహాయ

సమాధానం: బి

6. ఆర్థిక ప్రజాస్వామ్యం దేని ద్వారా సాధ్యం? (గ్రూప్-1, 1991)

ఎ) ప్రాథమిక హక్కులు బి) పీఠిక

సి)రాష్ట్ర విధానానికి సంబంధించిన అను సూచిత సూత్రాలు

డి) కేంద్ర జాబితా

సమాధానం: సి

7. మన రాజ్యాంగంలోని డైరెక్టివ్ ప్రిన్సిపల్స్ ఆఫ్ స్టేట్ విధానాన్ని ఏ రాజ్యాంగం నుంచి తీసు కొన్నారు? (గ్రూప్-2, 2003)

ఎ) ది వైమార్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ

బి) ది రిపబ్లిక్ ఆఫ్ ఐర్లాండ్

సి) దక్షిణ ఆఫ్రికా డి) పైవేవి కావు

సమాధానం: బి

8. భారతదేశ ప్రజల ప్రాథమిక విధులు దేనిలో చేర్చారు? (గ్రూప్-2, 2003)

ఎ) ప్రవేశిక బి) రాజ్యాంగంలోని మూడో భాగం

సి) రాజ్యాంగంలోని నాలుగో భాగం

డి) రాజ్యాంగంలోని 4ఎ భాగం

సమాధానం: డి

9. ప్రజా ప్రయోజన వ్యాజ్యం అనే భావన ఏ దేశంలో జనించింది? (గ్రూప్-2, బ్యాక్‌లాగ్ 2003)

ఎ) యూకే బి) ఆస్ట్రేలియా

సి) యూఎస్ఏ డి) కెనడా

సమాధానం: సి

10.'చింతన, భావ ప్రకటన, విశ్వాసం, నమ్మకం, ప్రార్థనా స్వేచ్ఛ' అనే పదాలు రాజ్యాంగంలోని ఏ భాగంలో ప్రస్తావించారు? (గ్రూప్-2, 2000)

ఎ) ప్రాథమిక హక్కులు బి) ఆదేశిక సూత్రాలు

సి) పీఠిక డి) కేంద్ర న్యాయస్థానం

సమాధానం: సి

11.రాజ్యాంగంలో న్యాయసమీక్ష అవకాశం కల్పించే ఆర్టికల్? (గ్రూప్-2(బి), 1993)

ఎ) 12 బి) 13 సి) 14 డి) 15

సమాధానం: బి

12.'అందరికీ ఉపాధి' అనే నిబంధనావళి దేని కిందకు వస్తుంది? (జేఎల్-2004)

ఎ) ప్రాథమిక హక్కులు బి) ఆదేశిక సూత్రాలు

సి) పౌర హక్కులు డి) పైవేవీ కావు

సమాధానం: బి

13.'ఆదేశిక సూత్రాలు ముందు తేదీ కలిగి ఉన్న చెక్కు లాంటివి' అని వ్యాఖ్యానించింది? (AEE-2008)

ఎ) ఎం.ఎం. రాయ్ బి) నెహ్రూ

సి) ఇందిరాగాంధీ డి) కె.టి. షా

సమాధానం: డి

14.ఉమ్మడి పౌర చట్టం చేయడానికి సంబంధించిన ఆర్టికల్? (AEE-2008)

ఎ) 47 బి) 44 సి) 28 డి) 32

సమాధానం: బి

15.వీటిలో రాజ్య విధాన ఆదేశిక సూత్రాల్లో చేరింది? (సివిల్ సర్వీసెస్-2008)

1) మానవుల అక్రమ రవాణా, వెట్టిచాకిరి నిషేధం

2) ఆరోగ్యానికి హానికరమైన మత్తు పదార్థాలను, ఔషధాలను వైద్య ప్రయోజనాలకు తప్ప ఇతరత్రా వాడటాన్ని నిషేధించడం

ఎ) 1 మాత్రమే బి) 2 మాత్రమే

సి) 1, 2 డి) ఏదీ కాదు

సమాధానం: బి

ఆదేశిక సూత్రాలు లేదా నిర్దేశిక నియమాలు

భారత రాజ్యాంగంలోని మూడో భాగం ప్రాథమిక హక్కుల గురించి పేర్కొంటే, నాలుగో భాగంలోని 36 నుంచి 51 వరకు గల అధికారాల గురించి ఆదేశిక సూత్రాలు లేదా నిర్దేశిక నియమాలు తెలుపుతున్నాయి. ప్రభుత్వ మితిమీరిన చర్యల వల్ల పౌరుల హక్కులకు, రాజకీయ స్వాతంత్ర్యానికి ప్రమాదం రాకుండా ప్రాథమిక హక్కులు రక్షణ కల్పిస్తున్నాయి. అదేవిధంగా ప్రజలకు ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యాలు, సమానత్వం లభించే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఆదేశిక సూత్రాలు నిర్దేశిస్తున్నాయి. కేవలం చట్టాలు, నియమాలు ఏర్పాటు చేయడం ద్వారానే ప్రజలను పరిపాలించడం సాధ్యం కాదు. ప్రభుత్వం ప్రజాసంక్షేమం కోసం అవసరమైన ఆర్థిక, సామాజిక లక్ష్యాలను నిర్దేశించుకోవడం ద్వారా అహింసాయుత సామాజిక విప్లవానికి, సంక్షేమ రాజ్యానికి మార్గాన్ని ఏర్పరచాలి. ఇటువంటి అత్యున్నతమైన లక్ష్యసాధనకే మన రాజ్యాంగ నిర్మాతలు ఆదేశిక సూత్రాలను రాజ్యాంగంలో పొందుపర్చారు.

గత రెండు దశాబ్దాలుగా మేధోచర్చల్లో నలుగు తున్న 'సుపరిపాలన' అంశాన్ని రాజ్యాంగ నిర్మాతలు స్వాతంత్ర్యానికి పూర్వమే గుర్తించడం వారి దూరదృష్టికి నిదర్శనం. కేవలం ఐదేళ్లకు ఒకసారి ఓటు వేసే రాజకీయ ప్రజాస్వామ్యం వల్ల ప్రయోజనం లేదని, ఆర్థిక, సామాజిక ప్రజాస్వామం కూడా ఉన్నప్పుడే అది సంపూర్ణమవుతుందని వారు భావించారు. సరైన అన్నవస్త్రాలకు నోచుకోని వారికి ఓటు హక్కు విలువ శూన్యమే. ''మేము కేవలం కొద్దిమంది ప్రజలు వచ్చి అధికారాన్ని చేజిక్కించుకునే యంత్రంగాన్ని తయారు చేయదలచుకోవడం లేదు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే వారి ముందు ఒక ఆదర్శాన్ని రాజ్యాంగం ఏర్పాటు చేయదలచింది. అదే ఆర్థిక ప్రజాస్వామ్యం'' అన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాటల ద్వారా తేటతెల్లమవుతోంది. ఇంతటి ఆదర్శవంతమైనవి కాబట్టే మన ఆదేశిక సూత్రాలు అభివృద్ధి చెందే హక్కుపై ఐక్యరాజ్యసమితి కన్వెన్షన్, ఇంటర్నేషనల్ కోవనెంట్ ఆన్ ఎకనామిక్, సోషల్ అండ్ కల్చరల్ రైట్స్ 1966కు మాతృక గా గుర్తింపు పొందాయి.

ఆర్టికల్-36

నాలుగో భాగంలో పేర్కొన్న 'రాజ్యం' అనే పదానికి మూడో భాగంలోని 'రాజ్యం' అనే పదానికి అర్థాన్ని ఇది తెలుపుతుంది.

మూడో భాగంలోని ఆర్టికల్ 12లో రాజ్యాన్ని నిర్వచించారు. దీని ప్రకారం పార్లమెంట్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, భారత భూభాగంలోని సంస్థలు లేదా భారత ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలన్నీ 'రాజ్యం' పరిధిలోకి వస్తాయి.

ఆర్టికల్-37

ఈ భాగంలోని నియమాలను కోర్టులు అమలు చేయలేవు. కానీ ఇవి పరిపాలనకు ప్రాథమిక సూత్రాలుగా ఉంటాయి. చట్టాలు తయారు చేసే సమయంలో వీటిని పరిగణనలోకి తీసుకోవాలి.

ఆదేశిక సూత్రాలను అమలు చేయమని న్యాయస్థానాలను ఆశ్రయించడానికి ఈ ఆర్టికల్ ద్వారా వీలు లేకుండా చేశారు. తద్వారా వీటిని ఉల్లంఘించినప్పటికీ పౌరులకు ఎటువంటి పరిహారం న్యాయస్థానాల ద్వారా లభించదు. వీటి అమలు కోసం రిట్లు జారీ చేసే అవకాశం కూడా లేదు. పార్లమెంట్ వీటి అమలుకు రాజ్యాంగం మౌలిక లక్షణాలు తప్ప మిగిలిన అంశాలను సవరించవచ్చు.

ఆర్టికల్-38

- సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాలతో కూడిన సామాజిక క్రమాన్ని సాధించటం ద్వారా ప్రజా సంక్షేమానికి రాజ్యం కృషి చేయాలి.
- వ్యక్తులు, వివిధ ప్రాంతాలు, వివిధ వృత్తుల మధ్య ఆదాయం, హోదా, సౌకర్యాలు, అవకాశాల్లోని అంతరాలను తగ్గించడానికి రాజ్యం ప్రయత్నించాలి.(దీనిని 44వ రాజ్యాంగ సవరణ చట్టం 1978 ద్వారా 20 జూన్ 1979 నుంచి అమలులోకి తీసుకువచ్చారు)

ఆర్టికల్-39

రాజ్యం కింది వాటి సాధన కోసం తన విధానాలను ఉద్దేశించాలి

- పౌరులందరికీ, స్త్రీ పురుషులకు సమానంగా జీవనోపాధి హక్కు కల్పించాలి
- సమాజంలోని వనరులపై అధికారం, నియంత్రణ అందరికీ ఉపయోగపడే విధంగా వికేంద్రీకృతం చేయాలి
- సంపద కేంద్రీకృతం కాని రీతిలో ఆర్థిక వ్యవస్థ ఉండాలి
- స్త్రీ,పురుషులకు సమాన పనికి సమాన వేతనం ఉండాలి
- స్త్రీ,పురుషులు, పిల్లలు వారి వయస్సు, శక్తికి మించిన పనులు చేసే విధంగా నిర్బంధించరాదు
- స్వాతంత్ర్యం, గౌరవంతో కూడిన ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరగడానికి పిల్లలకు అవకాశాలు, సౌకర్యాలను కల్పించాలి. తద్వారా వారిని పీడన నుంచి రక్షించాలి. (దీనిని 42వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976 ద్వారా 3 జనవరి 1977 నుంచి అమలులోకి తెచ్చారు)

ఆర్టికల్-39ఎ

ఆర్థికపరమైన, ఇతర వైకల్యాల వల్ల పౌరులకు న్యాయం అందకుండా పోరాదు. అందుకోసం తగిన చట్టాలు లేదా పథకాలు అమలు చేసి

ఉచిత న్యాయ సహాయం అందేలా రాజ్యం చూడాలి (దీనిని 42వ రాజ్యాంగ సవరణ చట్టం,1976 ద్వారా రాజ్యాంగంలో చేర్చారు)

సుప్రీంకోర్టు వివిధ సందర్భాల్లో ఆర్టికల్ 39ని ఊటంకిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా తీర్పు నిచ్చింది. ఎం.సి.మెహతా వర్సెస్ తమిళనాడు కేసులో ప్రమాదకరమైన పరిశ్రమల్లో పనిచేసే బాల కార్మికుల కుటుంబంలోని వ్యక్తికి ఆ బాలుడికి బదులుగా పని కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. సమాన పనికి సమాన వేతనం కల్పించకపోవడం ఆర్టికల్ 14ను ఉల్లంఘించడమేనని, దీనికి రిట్‌ను జారీ చేయవచ్చని కూడా సుప్రీంకోర్టు మరో కేసులో అభిప్రాయపడింది. న్యాయ సహాయం పొందడం ఆర్టికల్ 21కి అనుబంధమేనని, అవసరమైతే జిల్లా న్యాయమూర్తిని న్యాయ సహాయం అందించే ఏర్పాట్లు చేయమని సుప్రీంకోర్టు ఆదేశించవచ్చని కూడా వివిధ కేసుల్లో పేర్కొంది.

ఆర్టికల్-40 : గ్రామ పంచాయతీల ఏర్పాటు

గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసి వాటికి తగిన అధికారాలు, చట్టబద్ధతను కల్పించడం ద్వారా వాటిని స్వపరిపాలన యూనిట్లుగా తీర్చిదిద్దాలి.

గాంధీజీ ఆశయాలను సాధించడానికి ఉద్దేశించిన ఈ ఆర్టికల్ అమలుకు 1952 అక్టోబర్2న ''కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్''ను చేపట్టారు. ఈ ప్రాజెక్ట్ అమలు తీరుపై నియమించిన బల్వంతరాయ్ మెహతా కమిటీ సిఫార్సుల మేరకు పంచాయతీరాజ్ వ్యవస్థను 1959 అక్టోబర్ 2న రాజస్థాన్‌లోని నేగోర్ ప్రాంతంలో తొలిసారిగా ప్రారంభించి అదే సంవత్సరంలో అమలు చేశారు. ఆ తర్వాత అదే సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను అమల్లోకి తెచ్చారు. ఈ వ్యవస్థకు రాజ్యాంగ గుర్తింపును ఇవ్వడం ద్వారా పటిష్టం చేయడానికి 73వ రాజ్యాంగ సవరణ చట్టం, 1993 ద్వారా 11వ షెడ్యూల్డ్‌ను రాజ్యాంగానికి చేర్చారు.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 40 గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేయాలని పేర్కొంటోంది. కానీ నగర పాలక సంస్థల గురించి ప్రస్తావించలేదు. మన దేశంలో 1687లో మద్రాస్‌లో ఏర్పాటు చేసిన మున్సిపల్ కార్పొరేషన్‌తోనే నగర పాలన ప్రారంభం కావడం ఇక్కడ గమనార్హం. నగర పాలక సంస్థల గురించి ఏడో షెడ్యూల్‌లోని రాష్ట్ర జాబితాలో పేర్కొన్నప్పటికీ మనదేశంలో వీటికి రాజ్యాంగ హోదా 1993లో ఆమోదించిన 74వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారానే లభించింది. ఈ సవరణ ద్వారా 12వ షెడ్యూల్‌ను 9ఎ భాగాన్ని రాజ్యాంగానికి కొత్తగా చేర్చారు.

ఆర్టికల్-41

రాజ్యం తన ఆర్థిక పరిమితులకు లోబడి పనిచేయడానికి, విద్యార్జనకు, నిరుద్యోగం, వృద్ధాప్యం, రోగాల విషయంలో ప్రభుత్వ సాయం పొందే హక్కు కల్పించాలి.

ఆర్టికల్-42

పని చేసే ప్రాంతాల్లో శుభ్రమైన, తగిన సౌకర్యాలు కల్పించడం, ప్రసూతి సహాయం కల్పించేలా రాజ్యం చూడాలి.

ఆర్టికల్-43

కనీస జీవన ప్రమాణాలతో జీవించడానికి తగిన వేతనాన్ని అన్ని రకాల కార్మికులకూ కల్పించడానికి, గ్రామీణ ప్రాంతాల్లో కుటీర పరిశ్రమలను అభివృద్ధి చేయడానికి రాజ్యం తగిన చర్యలు తీసుకోవాలి

ఆర్టికల్-43ఎ

ఏ రంగంలోని పరిశ్రమల్లోనైనా కార్మికులకు నిర్వహణలో భాగస్వామ్యం కల్పించడానికి రాజ్యం చర్యలు చేపట్టాలి.(దీనిని 42వ రాజ్యాంగ సవరణ చట్టం, 1976 ద్వారా రాజ్యాంగంలో చేర్చారు)

ఆర్టికల్-44

భారత భూభాగం అంతటా రాజ్యం ఉమ్మడి పౌరస్మృతి ఏర్పాటుకు కృషిచేయాలి. భారతదేశం భిన్న మతాలు, సంస్కృతుల సమ్మేళనం. భిన్న ప్రాంతాలు, భాషలు, మతాల పౌరుల మధ్య సమైక్యతను సాధించి, లౌకిక రాజ్యాంగం ద్వారా సంఘటిత భారతదేశం ఏర్పాటును రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. అందుకు ఉద్దేశించిన ఉమ్మడి పౌరస్మృతి ఏర్పాటు మంచిదైనప్పటికీ అది అకస్మాత్తుగా ఒకేసారి ఏర్పాటు చేయడం మంచిది కాదు. శాసనసభలు ఆ దిశగా క్రమక్రమంగా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు వివిధ కేసుల్లో అభిప్రాయపడింది. అందువల్ల ఉమ్మడి పౌరస్మృతి ఏర్పాటు చేయమని మండమస్ ద్వారా భారత ప్రభుత్వాన్ని ఆదేశించాలని ధాఖలైన పిటిషన్‌ను మహర్షి అవదేశ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1994) కేసులో సుప్రీంకోర్టు తిరస్కరించింది.

ఆర్టికల్-45

రాజ్యాంగం అమల్లోకి వచ్చిన పదేళ్లలోపు దేశంలోని 14 ఏళ్లలోపు బాలబాలికలందరికీ ఉచిత నిర్బంధవిద్య కల్పించాలి. 86వ రాజ్యాంగ సవరణ చట్టం, 2002 ద్వారా రాజ్యాంగంలో 21ఎ ఆర్టికల్ ప్రవేశపెట్టి 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలకు విద్యాహక్కును ప్రాథమిక హక్కుగా కల్పించారు. ఇదే సవరణ ద్వారా ఆదేశిక సూత్రాల్లోని ఈ ఆర్టికల్‌ను కూడా సవరించి ప్రస్తుతం '' ఆరేళ్లలోపు బాలబాలికలకు విద్యను, రక్షణను కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి'' అని చేర్చారు.

భారతదేశం సంక్షేమ స్వభావంతో శ్రేయోరాజ్య నిర్మాణంలో నిమగ్నమైంది. సుప్రీంకోర్టు మొదటి ప్రధాన న్యాయమూర్తి హెచ్.జె. కానియా పేర్కొన్నట్లు నిర్దేశిక నియమాలు స్వల్పకాల ప్రయోజనాల కోసం కాకుండా దేశ ప్రజల ప్రయోజనాల కోసం శాశ్వత ప్రాతిపదికపై రాజ్యాంగంలో పొందుపరిచారు. నిర్దేశిక నియమాల్లో రాజ్యాంగ నిర్మాతల దార్శనికత ఉందని కానియా పేర్కొనడం గమనార్హం. రాజ్యాంగ లక్ష్యాలు, ఆశయాలను తెలిపే రాజ్యాంగ ప్రవేశికలో మన దేశం భారత ప్రజలకు ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో న్యాయాన్ని అందిస్తుందని పేర్కొంటోంది. రాజ్యాంగ ప్రవేశికలో సంక్షేమ స్వభావం అన్వయింపు భాగమే నిర్దేశిక నియమాలు. ఐర్లాండ్ రాజ్యాంగం నుంచి ఆదేశిక సూత్రాల భావనను గ్రహించినప్పటికీ భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా రూపొందించుకొని రాజ్యాంగంలోని 4వ భాగంలో 36-51 వరకు ఉన్న అధికరణలో వీటిని పొందుపరిచారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు పరిపాలన, విధాన రూపకల్పనలో ఆదేశిక సూత్రాలు మార్గదర్శకాలుగా పనిచేస్తాయి. వివిధ పోటీ పరీక్షల్లో ఈ అంశంపై ప్రశ్నలసరళి ఇలా ఉంటుంది.

1. కింది అంశాల్లో రాజ్య విధాన ఆదేశిక సూత్రాలుగా ఉన్నవి?

(సివిల్స్-2008)

ఎ) మనుషుల అక్రమ రవాణా, బలవంతపు చాకిరిని నిషేధించడం

బి) మందుల్లో వినియోగించే మినహా ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగించే మత్తు పదార్థాలు, మద్యపానాన్ని నిషేధించడం

1) ఎ 2) బి

3) రెండూ సరైనవే 4) రెండూ సరికావు

ఆదేశిక సూత్రాల్లోని గాంధేయ నియమాల్లో ఈ అంశం ఉంది. ప్రజల ఆయురారోగ్యాలకు భంగం కలిగించే మత్తు పదార్థాలు, మద్యపానాన్ని నిషేధించాలని 47 అధికరణ పేర్కొంటుంది. మొదటి అంశం ప్రాథమిక హక్కులకు సంబంధించిన పీడనాన్ని నిరోధించే హక్కు ఇది 23వ అధికరణలో ఉంది.

2. భారత రాజ్యాంగంలో నిర్దేశిక నియమాలు ఏ లక్ష్యంతో పొందుపర్చారు?

(సివిల్స్-2008)

ఎ) రాజకీయ ప్రజాస్వామ్యం బి) సాంఘిక ప్రజాస్వామ్యం

సి) గాంధేయ ప్రజాస్వామ్యం

డి) సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యం

ప్రాథమిక హక్కులు వ్యక్తి స్వేచ్ఛ, రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ఉద్దేశించి రాజ్యాంగంలో పొందుపరచగా, నిర్దేశిక నియమాలు సాంఘిక, ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని ఉద్దేశించి పొందుపరచిన అంశాలు. భారతదేశంలో ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని సాధించడానికి నిర్దేశిక నియమాలు ఒక ముఖ్య సాధనమని డా.బి.ఆర్. అంబేద్కర్ పేర్కొన్నారు.

3. ప్రపంచశాంతి, భద్రతకు మన దేశం కృషి చేస్తోందని భారత రాజ్యాంగంలోని ఏ అధికరణ తెలియజేస్తుంది?

(సివిల్స్-2002) (గ్రూప్-ఐఐ-2003)

1) 51 2) 48 ఎ 3) 43 ఎ 4) 41

భారతదేశ విదేశాంగ విధానం గురించి తెలిపే ఏకైక అధికరణ 51. మన దేశం ఇతర దేశాలతో స్నేహపూరిత సహాయ సహకార సంబంధాలను పెంపొందించుకునేందుకు కృషి చేస్తూ ప్రపంచశాంతిని పెంపొందించడానికి తోడ్పాటును అందిస్తుందని ఈ అధికరణ పేర్కొంటోంది.

4. ప్రసూతి సంబంధ సౌకర్యాలు దేని కిందకు వస్తాయి?

(జె.ఎల్.-2004)

1) ఆదేశిక సూత్రాలు 2) ప్రాథమిక హక్కులు

3) రాష్ట్ర విధులు 4) పైవేవీ కావు

రాజ్యాంగంలోని 42వ అధికరణ మాతా, శిశుసంక్షేమం గురించి తెలుపుతుంది. దీని ఆధారంగానే గ్రామీణ ప్రాంతాల్లోని స్త్రీలకు ప్రసూతి సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ సౌకర్యాలు ఆదేశిక సూత్రాల కిందికు వస్తాయి.

5. ఆదేశిక సూత్రాలు ఏ రాజ్యాంగం నుంచి గ్రహించారు?

(గ్రూప్-2-2003)

1) అమెరికా 2) ఇంగ్లండ్

3) ఐర్లాండ్ 4) దక్షిణాఫ్రికా

ఆదేశిక సూత్రాలను మన రాజ్యాంగ నిర్మాతలు ఐర్లాండ్ రాజ్యాంగం నుంచి గ్రహించారు. ఐర్లాండ్ స్పెయిన్ రాజ్యాంగం నుంచి గ్రహించింది.

6. భారత రాజ్యాంగంలోని ఏ అనుచ్ఛేదం కింద పరిసరాలు, అడవులు, వన్యప్రాణులను సంరక్షించే బాధ్యత రాజ్యానికి అప్పగించారు?

(సివిల్స్-2003)

1) అనుచ్ఛేదం 43ఎ 2) అనుచ్ఛేదం 48ఎ

3) అనుచ్ఛేదం 44 4) అనుచ్ఛేదం 46

1970ల్లో పర్యావరణ సమస్యలు ప్రపంచ వ్యాప్తంగా చర్చనీయాంశమైనప్పుడు మన రాజ్యాంగంలో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా 1976లో ఇందిరాగాంధి ప్రభుత్వ కాలంలో పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణులను సంరక్షించే అంశాన్ని రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల్లో పొందుపర్చారు.

7. ప్రస్తుత స్థితికి సంబంధించి, కింది వ్యాఖ్యానాల్లో ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలకు మధ్య సంబంధాన్ని తెలిపేది?

(సివిల్స్-1999)

1) ఏ సందర్భంలోనూ ప్రాథమిక హక్కుల కంటే ఆదేశిక సూత్రాలకు ప్రాధాన్యం ఉండదు

2) ఎప్పుడైనా ప్రాథమిక హక్కుల కంటే ఆదేశిక సూత్రాలకే

ప్రాధాన్యం

3) ఎప్పుడైనా ఆదేశిక సూత్రాల కంటే ప్రాథమిక హక్కులకే ప్రాధాన్యం

4) కొన్ని సందర్భాల్లో ప్రాథమిక హక్కుల కంటే ఆదేశిక సూత్రాలకు ప్రాధాన్యం ఉండవచ్చు

రాజ్యాంగం ప్రకారం ఆదేశిక సూత్రాల కంటే ప్రాథమిక హక్కులకే ప్రాధాన్యం ఉంటుంది. ఆదేశిక సూత్రాల అమలు కోసం పార్లమెంట్ రాజ్యాంగ సవరణలు చేస్తున్న సందర్భంలో 1973లో కేశవానంద భారతి కేసు, 1980 మినర్వా మిల్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పరిశీలిస్తే.. కొన్ని సందర్భాల్లో ప్రాథమిక హక్కుల కంటే ఆదేశిక సూత్రాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

8. కింది ఆదేశిక సూత్రాల్లో మొదట్లో భారత రాజ్యాంగంలో చేర్చనిది?
(సివిల్స్-1997)

1) పౌరులకు తగిన జీవనోపాధిని పొందే హక్కు

2) ఉచిత న్యాయ సహాయం

3) 14 సంవత్సరాల లోపు వయసున్న బాల బాలికలకు ఉచిత నిర్బంద విద్య

4) గోవధ నిషేధం

1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆదేశిక సూత్రాల్లో చేర్చిన 4 అంశాల్లో ఒకటి ప్రజలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందించడం 39ఎ అధికరణలో ఈ అంశాన్ని పొందుపరిచారు.

9. కామన్ సివిల్ కోడ్ విషయంలో కింది వ్యాఖ్యల్లో సరైంది?
(సివిల్స్-1996)

ఎ) కామన్ సివిల్ కోడ్‌ను అందరికీ వర్తింపచేయడం రాష్ట్ర విధి

బి) కామన్ సివిల్ కోడ్‌కు సంబంధించిన నిబంధన రాజ్యాంగంలోని మూడో భాగంలో ఉంది

సి) కామన్ సివిల్ కోడ్ నిబంధన జమ్మూ-కాశ్మీర్‌కు వర్తించదు

డి) కామన్ సివిల్ కోడ్‌ను 10 సంవత్సరాల లోపల దేశం మొత్తానికి వర్తింపజేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది

1) సి 2) సి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, డి

కామన్ సివిల్ కోడ్ అనే అంశం రాజ్యాంగంలోని 44వ అధికరణలో ఉంది. అంటే ఆదేశిక సూత్రాల్లో ఉంది. ఆదేశిక సూత్రాలు జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రానికి వర్తించవు.

10. రాజ్య విధాన ఆదేశిక సూత్రాల్లో కింది వాటిలో సరైంది?
(సివిల్స్-1995)

ఎ) అభివృద్ధి కోసం రాజ్యం శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించడానికి ప్రయత్నించాలి

బి) భారతదేశమంతటా ఒకే రకమైన సివిల్ కోడ్ ఏర్పరచడానికి రాజ్యం ప్రయత్నించాలి

సి) జనాభా విధానాన్ని కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను పెంపొందించడానికి రాజ్యం ప్రయత్నించాలి

డి) పర్యాటకాన్ని పెంపొందించడానికి రాజ్యం చర్యలు తీసుకోవాలి

1) ఎ, సి 2) బి, డి

3) బి 4) ఎ, బి,సి, డి

సమాధానం : (3)

11. కింది వాటిలో రాజ్య విధాన ఆదేశిక సూత్రం ఏది?
(సివిల్స్-1994)

1) రాజ్యం ఎవరికీ చట్టం ముందు సమానత్వాన్ని నిరాకరించ రాదు

2) కుల, మత, జాతి, లింగ, జన్మస్థల కారణాల ద్వారా రాజ్యం ఎవరి పట్లా వివక్షతచూపరాదు

3) అస్పృశ్యత నిషేధించారు. దాన్ని ఏ రూపంలో ఆచరించినా శిక్షార్హమవుతుంది

4) రాజ్యం పరిసరాలను పరిరక్షణ మెరుగుపరచడానికి ప్రయత్నించాలి

పై ప్రశ్నకు ఇచ్చిన సమాధానాల్లో మొదటి మూడు అంశాలు మన రాజ్యాంగం భారత పౌరులకు మూడో భాగంలో ప్రసాదించిన ప్రాథమిక హక్కులకు సంబంధించినవి కాగా పరిసరాల పరిరక్షణ ఆదేశిక సూత్రాలకు సంబంధించింది

12. రాజ్య విధాన ఆదేశిక సూత్రాలు 'బ్యాంకులు తమ వద్ద ఉండే డబ్బు సౌకర్యాన్ని అనుసరించి చెల్లించే చెక్కు' వంటివి అని వర్ణించిన వారు?

1) పండిట్ నెహ్రూ 2) బి.ఎన్. రావు

3) కె.జె. షా 4) అంబేద్కర్

ప్రభుత్వాలు తమ వద్ద ఉండే ఆర్థిక స్థోమతను అనుసరించి మాత్రమే ఆదేశిక సూత్రాలను అమలుపరచగలవు. పైగా వీటికి న్యాయ సంరక్షణ లేదనే ఉద్దేశంలో కె.జె. షా విమర్శనా దృక్పథంతో ఈ వ్యాఖ్య చేశారు.

13. నిర్దేశిక నియమాలకు ప్రభుత్వాలు కట్టుబడి ఉండటానికి ప్రధాన కారణం?

1) న్యాయపరమైన సంరక్షణ వీటికి ఉండటం

2) ఇవి ప్రధానంగా ప్రజాస్వామ్య సూత్రాలు కావడం

3) ఇవి ప్రధానంగా గాంధేయ సూత్రాలు కావడం

4) వీటికి ప్రజా సమ్మతి, నైతిక మద్దతు ఉండటం

నిర్దేశిక నియమాలను విస్మరించడానికి వీలులేదని వీటికి ప్రజా సమ్మతి, నైతిక మద్దతు ఉందని వ్యాఖ్యానించినవారు అల్లాడి కృష్ణ స్వామి అయ్యర్.

14. సమాజ సంక్షేమానికి ఉద్దేశించిన నిర్దేశిక నియమాలను ప్రభుత్వాలు విస్మరించలేవు. ఎందుకంటే వారు కచ్చితంగా ఎన్నికల సందర్భంగా ఓటర్లకు సమాధానం చెప్పాల్సి ఉంటుందని రాజ్యాంగ పరిషత్‌లో పేర్కొన్నవారు?

1) అంబేద్కర్ 2) కె.ఎం. మున్షి

3) పండిట్ నెహ్రూ 4) డా. రాజేంద్రప్రసాద్

సమాధానం : (1)